# ఏటొవచ్చే గోరువంక

ఆనాడు ఉగాది. బడితోటలో పిల్లలంతా సంతోషంగా సంబరాలు పడుతూ - పరవళ్ళు తొక్కుతున్నారు. వారి అందాల పూలగౌనులు, రంగురంగుల చొక్కాలు సందె వెలుగులలో మెరిసిపోతున్నవి. గిరగిరా తిరుగుతూ చెమ్మచెక్కా చేరడేసి మొగ్గవేస్తున్న బాలికల గాజులు గలగలమంటున్నవి. ఉత్సాహంతో ఉల్లాసంగా కొందరుబాలురు చెడుగుడు ఆడుతున్నారు. బిళ్ళంగోడు ఆకాశంలో గింగిరాలు తిరిగేట్టు విరజిమ్మేస్తూ పందెము కాస్తోంది ఒక జట్టు.

అంతలో "చూడు! చూడు! ఆకాశంలో తమాషాగా ఎంతహాయిగా ఆపిట్టలు ఎగిరిపోతున్నవో! ఆ వింత చూడండ్రా" అని సుభద్ర అదాటుగా కేక వేసింది. ఆ కేక విని ఆడే ఆడే ఎక్కడి ఆట అక్కడే ఆపేసి నీలిమబ్బులవంక కన్నార్పక అగుపించే పిట్టల దండును చూస్తున్నారా పిల్లలంతా.

ఎగిరే ఎగిరే ఓ పిల్ల పిట్ట పట్టు తప్పి నేల రాలింది. దానికి ఎగరటం ఏమంత బాగా అలవాటు అయినట్టులేదు. అది భయంతో గడగడలాడసాగింది. అంజి దబదబా ఆ పసిపిట్టను చేతుల్లోకి తీసికొని "బాగా దెబ్బతిని దిమ్మరపోయినట్టున్నదే పాపం!" అన్నాడు.


పిల్లమూక ఆ రాలిన చిన్న పిట్టచుట్టూ మూగారు. అదుర్దాగా పిట్టయెలావున్నదో అని ఆ పిల్లలు వంగి వంగి చూస్తున్నారు. అంతలో అంజి ఆ బుజ్జి పిట్టచుట్టూతా చేరిన పిల్లలను అదమాయించి అవతలకు నెట్టాడు. అతడు సుభద్రను పిలిచి "ప్రాణం ఉన్నట్టుందే దగ్గరకు తీసి సాకితే బతుకవచ్చు" ఇంద తీసుకో! అని ఆమెచేతికి అందించాడు.

అమాయికమైన ప్రేమా ఆనందమూ ఆపసిగుండెల్లో ఒక్కసారిగా తొణికిసలాడినై. ఆ పిట్టను అందుకొంది సుభద్ర. మెరిసే ఆ చిన్నారిరెక్కలను నిమురుతూ ఏవేవో వచ్చీరాని పాటలు పాడుతూ గంతులు వేస్తోంది.

"ఓపిట్ట! మాపిట్ట
అందాలపిట్టా!
నిన్ను చూసీ పూలు
కన్నీళ్ళు రాల్చాయి!
ఆ చిన్నికనులెత్తి
అటు చూడుపిట్ట"

సావాసగాళ్ళంతా ఆపాట అందుకున్నారు.

"చాలా జాగ్రత్తగా పట్టుకో, ఒత్తబోకు, నొప్పి పుడుతుంది అసలే అదిదెబ్బతిని వున్నది సుభద్రా!" అన్నదిహైమ. పిల్లలు పిట్టను ఇంటికి భద్రంగా తెచ్చారు. దానిని చూచి వాళ్ళఅమ్మ రాధ "ఇది బలే




గోరువంకే! అన్నది. ఆ డస్సిపోయిన పిట్ట పక్కలు ఊదింది. అరచేతులు రాచి వేడి వచ్చేటట్లు చేసింది. పిట్ట కదలింది. కళ్లు తెరిచింది. చేతిపైకి ఎక్కించి కాళ్లు కదిలించితే వేళ్లు గట్టిగా పట్టుకుంది. ఓ గిన్నెలో మంచినీళ్లుపోసి దానిముందు పెట్టారు. గింజలు కాసిని తెచ్చి ఆ గోరువంక ముందు వెదచల్లారు. శాంతి, సుభద్ర, రాము, లక్ష్మి ఎప్పుడూ మోజుకొద్దీ ఆ పిట్టదగ్గిరే ఉండిపోయేవారు. ప్రొద్దస్తమానం దానిని చూస్తూ అన్నానికి రమ్మన్నా రాక మారాం చేసేవారు. రెప్ప అర్పకుండా అది కాళ్లు కదలించినా రెక్కలు విదలించినా అదోయిదిగా చూస్తూ కూర్చునేవారు.

శ్రీ మద్దులూరి రామకృష్ణ

ఆ పిట్టకు కాస్త ఓపిక వచ్చింది. నోరు విప్పింది. కిచకిచలాడింది. సత్తువవస్తే ఎగిరిపోతుందని గోరువంకను పంజరంలో పెట్టారు. ముద్దుగా రాము అరిసెముక్క దాని ముక్కులో కూరబోయాడు. అది చూచి సుభద్ర "ఒరేయ్! రామ్!! అది అరిసె తిందురా!" అని బ్రగున ఆ ముక్క లాక్కుని నోట్లో వేసికొన్నది.


అంతటా వెదుకుతూ దిగులుగా అరచుకుంటూ ఓ పెద్దగోరువంక వచ్చి వారి దొడ్డి గోడపై వాలింది. ఆచూకీతీసి తన పిల్లను ఆనవాలు పట్టింది ఆ కన్నపిట్ట. ఎవరూ లేని సమయంచూచి పంజరంలో వున్న బిడ్డవద్దకు వెళ్ళింది. తల్లీ పిల్లా ఏమిటో కిచకిచమన్నవి. పిట్టా పిట్టా ముద్దు పెట్టుకొన్నాయి. దీనంగా మౌనంగా చూస్తూ తల్లిపిట్ట పోలేక, పోలేక ఎగిరిపోయింది. రోజూ, కన్నపిట్ట గోడపై వాలి కిచకిచలాడి పోతుండేది.

ఆటపాటల సరదాతో ఎన్నాళ్లో గడచిపోయినై. ఏరువాకపున్నమి వచ్చింది. బుల్లిపిట్ట ఓపిక కాస్త జాస్తయింది. ఎగిరే బలం వస్తున్నది. "వదిలితే ఎగిరి, దానియిష్టము వచ్చినట్టు కమ్మగా తిని, హాయిగా తిరుగుతుందిగదా!" అన్నాడు అంజి. అయితే దానిని గాలికి వదలడం ఆ చిన్నాళ్ళకెవరికీ యిష్టంలేదు. అది యెక్కడికి పోతుందిలే, ఇక్కడే మన తోటలో గున్నమామిడిపై గూడుకట్టితే హాయిగా అందులోనే వుంటుంది. అన్నారు వారంతా.

ఆ పిల్లలందరూ కలిసి గూడుకట్టే అడావుడిలో పడ్డారు. అంజి అందరకూ పనులు పురమాయించాడు.

వాడు ఆ మామిడిచెట్టు చిటారుకొమ్మకు ఎక్కి ఒక గూడు కట్టాడు.

ప్రభ పంజరంలోని గోరువంకను తేలికగా నొప్పి తగలకుండా పట్టుకొని వచ్చి, ఆ కొత్త గూటిలో వదలబోయాడు. పట్టుతప్పి జారినట్టు జారింది ఆ పిట్ట. రెక్కలు తపతపా కొట్టుకుంటూ తొలకరి మబ్బుల్ని చూడపోతున్నదా అన్నట్టు ఎత్తుగా ఎగిరిపోతున్నది. ఒయ్యారంగా అది ఎగురుతూ వుంటే చూడముచ్చట అయింది. కంటి



## పోలీసులు

చిత్రకారుడు: చి॥ యస్. నాగేశ్వరరావు (౯-ఏళ్లు)

కనపడనంతదూరం పోయిందాకా చూస్తున్నారా పిల్లలంతా. "తప్పించుకుని పోయింది, పాపం దానిగతి యేమవుతుందో" అని వాళ్లు ఎంతో దిగులుపడ్డారు. ఎక్కడికి పోతుంది! అందరిలాగా అదీ తన అమ్మవద్దకు వెళ్లుతుంది, అని అంజి అనేసరికి ఆపిల్లల చిన్ని మనస్సులు ఆనందంతో పొంగిపోయాయి.

బడికి పోయేటప్పుడల్లా ఉత్త గూడు చూచి ఆ పిట్టగతి ఏమయిందో, అది ఎలా వుందో అని కంట తడిపెట్టుకొనేవారు. ఈ యేడు రాకపోయినా వచ్చే ఏడాదికన్నా అది తిరిగివస్తుందనే ఆశతో సరిపెట్టుకొని వున్నారు.

చెట్లఆకులు పండి రాలిపోతున్నవి. చల్లని వసంతకాలం కమ్మని పూలవాసనలు మోసుకవచ్చింది. రకరకాల పిట్టలు కిలకిలలాడుతూ గుంపులు గుంపులుగా వచ్చి చెట్లనిండా వాలుతున్నవి. లేతమామిడి చివుళ్లుతిని నిండిన పొట్టలతో ఉల్లాసంగా చలాకిగా గంతులువేస్తూ కులాసాగా కూతలు వేస్తున్నవి.

ఓనాడు ఆ పిల్లలు చెట్టపట్టాలు పట్టుకుని పకపకా నవ్వుతూవుండగా ఆ గోరువంక వచ్చి సుభద్రగోడమీద వాలింది. ఆడేపనిగా ఆ పిల్లల ఆటలు చూస్తూ అక్కడే చిరుగంతులువేస్తూ కిచకిచమంటున్నదా పిట్ట.

సుభద్ర ఆ గోరువంకను చూచి గుర్తుపట్టింది. "ఇదేరా! ఇదే మనపిట్ట!" అని అందరనూ పేరుపేరున పిలిచి చెప్పింది సుభద్ర. పోయి పట్టుకోబోతే చేతిలోకి చిక్కినట్టే చిక్కింది. అరచేతిని ముద్దుపెట్టుకొన్నట్టు పెట్టుకొని రివ్వున లేచిపోయింది. వెళ్ళివెళ్ళి వారు కట్టిన గూటిలో తలదూర్చింది. అది కూస్తుంటే మంచిపాట పాడినట్టుండేది. దానినిచూచి పిల్లలు సంతోషంతో చప్పట్లుకొట్టారు.

ఆనాటినుండీ ఏటా చెట్టు చిగిర్చే కాలంలో చలికాంద్రు కట్టిన గూటిలోకి వచ్చి కాపురముండేదా గోరువంక. వానలు జోరుగాకురిసే కాలంలో ఎక్కడికి పోయేదో ఎవరికీ తెలిసేదిగాదు. గజగజ వణికించే చలికాలం అయిపోగానే మరల ఆ గూటికి వస్తుండేది. "తంటాలుపడి బ్రతికించేవరకే మన పని, అటుపై దానియిష్టం వచ్చినట్టు హాయిగా ఎగురుతూ ఎక్కడెక్కడికో పోతూ వస్తూవుంటే చూడముచ్చటగా వుంటుంది." అని ఆ పిల్లలు ఇప్పటికీ అంటున్నారు. ★